

**ఆర్మూర్‌లో ట్రాఫిక్ అస్తవ్యస్తం** 2



**డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడిగా విక్టర్** 2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## విద్యార్థుల 'ఎక్స్‌పోజర్ విజిట్'



**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్‌కు చెందిన విద్యార్థులు శనివారం ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం, బాసర ట్రిబుల్ ఐటీని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాచీన చారిత్రాత్మక రామాలయం ప్రాముఖ్యత గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. ట్రిబుల్‌ఐటీలో డిజిటల్ తరగతులు, రీడింగ్ రూమ్, ఆడిటోరియం, ఇతర ప్రయోగశాలలను సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ గోవర్ధన్ విద్యార్థులతో సంభాషించి అవగాహన కల్పించారు. 140 మంది విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





## సొసైటీల్లో యూరియా నిల్వలు అందుబాటులో ఉండాలి

**అక్షరటుడే, ఇందూరు :** జిల్లాలోని అన్ని సహకార సంఘాల గోడౌన్లలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. నగర శివారులోని ఖానాపూర్‌లో ఎరువుల గిడ్డంగిని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్లలో నిల్వ ఉన్న యూరియా ఇతర ఎరువులను పరిశీలించి స్టాక్ వివరాల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల అవసరాలకు అనుగుణంగా అన్ని ప్రాంతాలకు ఎరువులను చేరవేయాలని సూచించారు. రైతులు ఇబ్బందులు పడితే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట వ్యవసాయ అధికారి వీరస్వామి, సహకార శాఖ అధికారి రాజేశ్వర్ ఉన్నారు.

### భూభారతి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** భూభారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. నందిపేట తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను ఎలా పరిష్కరించాలనే విషయాలపై కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. సమీక్ష సమావేశంలో తహశీల్దార్ సంతోష్, అధికారులు పాల్గొన్నారు.

> నిజామాబాద్ నగరంలో దొంగలు రెచ్చిపోతున్నారు. వరుస చోరీలతో హడలెత్తిస్తున్నారు. తాళం వేసిన ఇళ్లతో పాటు దుకాణాల్లో చొరబడుతున్నారు. తాజాగా శుక్రవారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలో రెండు ఏటీఎంలో చోరీ చేశారు. రెండు ఏటీఎంలను ధ్వంసం చేసి రూ.33 లక్షల వరకు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన నగరంలో తీవ్ర కలకలం రేపింది. పోలీసు నిఘా వ్యవస్థపై అనుమానాలు రేకెత్తిస్తోంది. - అక్షరటుడే, నిజామాబాద్ సిటీ



నిజామాబాద్ నగరంలో ఆరు పోలీస్ స్టేషన్లతో పాటు ఒక రూరల్ పోలీస్ స్టేషన్, ఒక మహిళ పోలీస్ స్టేషన్ ఉంది. ప్రతి ఠాణాలో 30 మంది వరకు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి రాత్రి సమయంలో మూడు వాహనాల్లో తమ పరిధిలో దొంగతనాలతో పాటు ఇతర అసాంఘిక కార్యక్రమాలు అరికట్టడానికి పెట్రోలింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. ఒక్కో ఠాణా నుంచి ఐదుగురు సిబ్బంది పెట్రోలింగ్ విధుల్లో పాల్గొనాలి. ప్రతిరోజూ రాత్రి వేళలో ఒక పెట్రో కారుతో పాటు మూడు బ్లూ కోర్టు తనిఖీలు సీఐ, ఎస్సై స్థాయి అధికారులు పెట్రోలింగ్ బయలుదేరితే వారి వెంట ప్రత్యేక టీం పనిచేస్తుంది. అయితే నగరంలో పెట్రోలింగ్ మొక్కుబడిగా సాగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో చోరీలు పెరిగాయని పేర్కొంటున్నారు.

# రెచ్చిపోతున్న దొంగలు

▸ నగరంలో వరుస చోరీలు ▸ రెండు ఏటీఎంలలో దొంగతనం ▸ రాత్రిపూట పెట్రోలింగ్ కరువు

నగరంలోని రెండు ఏటీఎంలలో కేవలం 15 నిమిషాల వ్యవధిలో చోరీలు జరగడం గమనార్హం. నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల పాంగ్రా పరిధిలోని ఓ బ్యాంకుకు సంబంధించిన డిపార్ట్మెంటల్ క్రెడిట్ ఏటీఎంలో చోరీ జరిగింది. ఇది జరిగిన 15 నిమిషాల వ్యవధిలో ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వర్ని చౌరస్తాలో గల ఎస్‌బీఐ ఏటీఎంలో దొంగతనం జరిగింది. రెండు ఏటీఎంలలో చోరీ జరిగితే పోలీసులు ఏం చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏటీఎంలలో అలారం వ్యవస్థ ఉంటుంది. చోరీకి యత్నించినప్పుడు అది మోగుతుంది. అయితే ఈ ఘటనలో అలారం మోగకపోవడం గమనార్హం. అలారం, సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో చూసుకోవాల్సిన బ్యాంకు సిబ్బంది సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు అర్థం అవుతోంది. నగరంలో పెట్రోలింగ్ సక్రమంగా చేయకపోవడంతోనే నేరాలు పెరిగాయని పలువురు ఆరోపిస్తున్నారు.

### నిందితుల కోసం వేట కొనసాగుతోంది



కమిషనరేట్ పరిధిలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిఘా వ్యవస్థ పటిష్టంగా ఉంది. పెట్రోలింగ్ సైతం నిత్యం జరుగుతోంది. రెండు ఏటీఎంల చోరీలు జరిగినప్పుడు సైరన్ మోగలేదు. దీంతో మాకు సమాచారం అందలేదు. నిందితుల కోసం వేట కొనసాగుతోంది. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నాం. – రాజా వెంకట్ రెడ్డి, ఏసీపీ, నిజామాబాద్



## న్యూఇయర్ వేడుకల్లో పోలీసు సూచనలు పాటించాలి: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** న్యూఇయర్ వేడుకల్లో పోలీసు సూచనలు పాటించాలని ఇన్‌ఛార్జి సీపీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. న్యూ ఇయర్ వేడుకల పేరుతో అతిగా మద్యం సేవించి రోడ్లపై వేగంగా వెళ్తూ ప్రమాదాలకు కారణం కాకూడదని ఇన్‌ఛార్జి సీపీ పేర్కొన్నారు. వేగంగా వాహనాలు నడుపుతూ.. ఇతరులను ఇబ్బంది పెట్టడమే కాకుండా తమ జీవితాలు కూడా రిస్క్‌లో పెట్టుకోవద్దని హితవు పలికారు. న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా 31వ తేదీ సాయంత్రం నుంచి పోలీసులు నగరం నలుదిక్కులా అప్రమత్తంగా ఉంటారని ఇన్‌ఛార్జి సీపీ సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలకు ఏమాత్రం వెనకాడబోమని ఆయన వెల్లడించారు. ఎక్కడ కూడా పోలీస్ అనుమతి లేకుండా న్యూ ఇయర్ సెలబ్రేషన్లు చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఫామ్ హౌస్, క్లబ్‌లు, గేటెడ్ కమ్యూనిటీలో అనుమతిలేకుండా నూతన సంవత్సర కార్యక్రమాలు నిర్వహించరాదని వివరించారు. సెలబ్రేషన్లలో భాగంగా పరిమితికి మించకుండా సౌండ్ సిస్టం వాడాలని సీపీ సూచించారు. ప్రజలను భయాందోళనకు, ఇబ్బందులకు గురయ్యేలా క్రాకర్స్, ఆర్కెస్ట్రా పెట్టవద్దన్నారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. డ్రంక్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని పేర్కొన్నారు.



## పాఠశాలలను తనిఖీ చేసిన సబ్‌కలెక్టర్

**అక్షరటుడే, బోధన్:** మండలంలోని పలు పాఠశాలలను సబ్ కలెక్టర్ వికాస్ మహతో శనివారం తనిఖీ చేశారు. ముందుగా మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కార్యక్రమాలపై సబ్ కలెక్టర్ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన బేస్‌లైన్, మిడ్‌లైన్ పరీక్షల్లో వచ్చిన మార్కుల వివరాలను పరిశీలించారు. విద్యార్థుల తెలుగు, ఇంగ్లీష్‌లో చదువుతున్న విధానాన్ని ఆయన ప్రత్యక్షంగా సమీక్షించారు. విద్యార్థులు చూపిన ప్రతిభపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తూ నాణ్యమైన బోధన అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మినార్‌పల్లిలోని మండల ప్రాథమిక పాఠశాలను సబ్‌కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. పాఠశాలలో రెండో, మూడో తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట బోధన్ ఎంఈవో నాగయ్య, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

## ఏటీఎంలలో చోరీ.. యంత్రాలను తగులబెట్టిన దుండగులు



**అక్షరటుడే, ఇందూరు:** దొంగలు రెచ్చిపోయారు. జిల్లా కేంద్రంలో ఒకేరోజు రెండు ఏటీఎంలలో చోరీకి యత్నించిన దుండగులు.. యంత్రాలు తెరుచుకోకపోవడంతో వాటిని తగులబెట్టారు. అనంతరంలో వాటిల్లోని సుమారు రూ. 50 లక్షలకు పైగా నగదును దోచుకెళ్లారు. నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు దుండగులు ఏటీఎంల చోరీకి పాల్పడ్డారు. బైక్‌పై వచ్చిన దొంగలు ఏటీఎం కేంద్రంలోకి చొరబడ్డారు. అక్కడ ఉన్న యంత్రాన్ని ధ్వంసం చేసి నగదు కాజేయాలని యత్నించారు. కానీ, తెరుచుకోకపోవడంతో దానిని తగులబెట్టారు. అనంతరం ఏటీఎంలోని నగదును ఎత్తుకెళ్లారు. ఇక నాలుగో ఠాణా పరిధిలోని మరో ఏటీఎంలోనూ చోరీ జరిగింది. ఇక్కడి ఏటీఎం కూడా తెరుచుకోకపోవడంతో దానిని కూడా కాలబెట్టారు. ఇందులో ఉన్న నగదును దోచుకున్నారు. అయితే ఐదో టౌన్ పరిధిలోని ఏటీఎంలు రూ.10 లక్షలు ఉండగా, నాలుగో టౌన్ పరిధిలోని ఏటీఎంలు రూ.27 లక్షలు ఉన్నాయి. అయితే ఇందులో కొంత నగదు అగ్నికి ఆహుతి కాగా.. సుమారు రూ. 30 లక్షల దొంగలు ఎత్తికెళ్లినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలాలను ఏసీపీ బస్వా రెడ్డి, రాజా వెంకట్ రెడ్డి పరిశీలించారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఇద్దరు బైక్‌పై, కారులో రెక్కీ నిర్వహించి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. నగరంలోని పలు ఏటీఎంలలో చోరీలకు పాల్పడ్డ నిందితులను త్వరలోనే పట్టుకుని నగదు రికవరీ చేస్తామని ఇన్‌ఛార్జి సీపీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం నగరంలోని చోరీకి గురైన రెండు ఏటీఎంలను తనిఖీ చేశారు. జిల్లాలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు.

## మద్దెల చెరువు జీపీని ప్రారంభించిన ఎమ్మెల్యే



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పిట్లం మండలంలోని మద్దెల చెరువు గ్రామంలో పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మద్దతుదారును సర్పంచ్‌గా గెలిపించినందుకు ఆయన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే సర్పంచ్‌గా ఎన్నికైన అనంతరం వెంటనే డ్రెయినేజీ సమస్యను పరిష్కరించినందుకు సర్పంచ్ కళావతిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక మండల నాయకులు, నూతన సర్పంచులు, నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే ధన్‌పాల్‌ను కలిసిన సుద్దపల్లి సర్పంచ్

**అక్షరటుడే, ఇందూరు:** ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారుడు పానుగంటి రూప సతీష్‌రెడ్డి సర్పంచ్‌గా పోటీచేసి విజయం సాధించారు. ఈ మేరకు ఆయన శనివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ను ఎమ్మెల్యే ధన్‌పాల్ సన్మానించారు. గ్రామాభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్ రెడ్డి, వినోద్ రెడ్డి, గణేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.




## డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులివ్వాలి

**అక్షరటుడే, ఇందూరు:** తమకు పాత పద్ధతిలోనే అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డెస్క్ జర్నలిస్టులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు శనివారం నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద డీజేఎఫ్‌టీ (ఉమ్మడి నిజామాబాద్ జిల్లా) శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం డెస్క్ జరల్నిస్టులకు అన్యాయం చేయాలని చూస్తోందన్నారు. ఇందుకోసమే జీవో 252ను తీసుకువచ్చిందని ఆరోపించారు. అక్రెడిటేషన్ కార్డు, మీడియా కార్డు పేరుతో జర్నలిస్టులను విడదీయాలని కుట్ర పన్నిందని మండిపడ్డారు. తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి మరీ రాత్రి సమయాల్లో పనిచేస్తున్న తమను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరులు, డెస్క్ జర్నలిస్టులు కలిసి పనిచేస్తేనే జర్నలిజం అవుతుందన్నారు. కానీ సర్కారు మాత్రం వివక్ష చూపిస్తోందని.. ఇది సరైనది కాదని పేర్కొన్నారు. జీవో 252ను రద్దు చేసి, పాత పద్ధతిలోనే అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. డెస్క్ జర్నలిస్టుల ఆందోళనకు వివిధ జర్నలిస్టు సంఘాలు మద్దతు తెలిపాయి. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జమాల్‌పూర్ గణేశ్, రామకృష్ణ, సుభాష్, పంచరెడ్డి శ్రీకాంత్, భూపతి, సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.





## కనుల పండువగా అయ్యప్ప ఆరట్టు..

**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని చొక్కయ్యగుట్ట ప్రాంతంలో వెలిసిన అయ్యప్ప స్వామి సన్నిధానంలో ఆరట్టు ఉత్సవం శనివారం కనులపండువగా జరిగింది. మండల దీక్షలు ముగిసిన నేపథ్యంలో గురుస్వాములు పోల్కం సుదర్శన్, భూమేష్, రత్నంల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని శనివారం ఉదయం వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి రథంపై ఉంచారు. పట్టణంలోని బడా భీమ్‌గల్ చౌరస్తాలో ఉన్న హనుమాన్ దేవాలయం వద్ద మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్ రథయాత్రను ప్రారంభించారు. 'స్వామియే శరణం అయ్యప్ప' అనే నామస్మరణతో భీమ్‌గల్ వీధులు మార్మోగాయి. ముచ్కూర్ చౌరస్తా, నందిగల్లీ, అంగడి బజార్ మీదుగా ప్రధాన వీధుల గుండా సాగిన ఊరేగింపులో మాలధారులు రంగులు పూసుకుని, భజనలు చేస్తూ నృత్యం చేయడం అందరినీ ఆకట్టుకుంది. ఊరేగింపు అనంతరం ఆలయ ప్రాంగణంలోని కోనేరు వద్దకు చేరుకున్న భక్తులు, దానిని పవిత్ర పంపానదిగా భావిస్తూ స్వామివారికి ఆరట్టు మహోత్సవాన్ని నిర్వహించారు. విగ్రహాన్ని జలకాలాడించి అనంతరం అభిషేకాలు, పడిపూజలు పూర్తి చేశారు. ఈ సందర్భంగా భక్తులకు బండి బాలకృష్ణ కుటుంబ సభ్యులు భిక్షా (అన్నదానం) కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో పట్టణ సీఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది, అయ్యప్ప సేవా సమితి ట్రస్ట్ సభ్యులు యాదగిరి, రాజశేఖర్, రమేష్ గురుస్వామి, సర్వ సమాజ కమిటీ అధ్యక్షుడు నీలం రవి, వివిధ పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే సమగ్ర వికాసం




**అక్షరటుడే, భీమ్‌గల్:** క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక దృఢత్వానికి ఎంతగానో దోహదపడతాయని హైకోర్టు న్యాయవాది అశ్విని రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని అశ్విని రెడ్డి హాస్పిటల్స్ యాజమాన్యం ఆధ్వర్యంలో శనివారం స్థానిక పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు 60 జతల క్రీడా దుస్తులను అందజేశారు. దివంగత రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమార్తె అశ్విని రెడ్డి నవీన్ ఈ విరాళాన్ని అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. తమ తండ్రి క్రీడారంగానికి చేసిన సేవలను స్మరిస్తూ ఈ కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు ఉచితంగా క్రీడాదుస్తులు అందించిన అశ్విని రెడ్డి దంపతులకు ఎంఈవో, హెచ్ఎం డి.స్వామి, ఫిజికల్ డైరెక్టర్ రమణ, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పేటా సంఘం అధ్యక్షుడు టి. విద్యాసాగర్ రెడ్డి, వైద్యులు వంశీ, రామాచారి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడిగా విక్టర్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా విక్టర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ దేవేందర్, కార్యదర్శి సాయి రెడ్డి, సంఘ సభ్యులు రాజలింగం, సంతోష్ కుమార్, ఠాగూర్, నిజాం, తురబ్ అలీ, శశి కిరణ్, శివకుమార్, సతీష్ కుమార్ పాల్గొన్నారు.



## మండలాల్లో జీవాలకు నట్టల నివారణ మందుల పంపిణీ

**అక్షరటుడే, ఆర్మూర్:** మండలాల్లో జీవాలకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నట్టల నివారణ మందులను పంపిణీ చేస్తున్నారు. తద్వారా గొర్రెలకు, మేకలకు రోగాలు దరిచేరవని పశువైద్యులు పేర్కొంటున్నారు. ఆలూర్ మండలం రాంచంద్రపల్లిలో సర్పంచ్ భూషణ్, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర ఆధ్వర్యంలో శనివారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూషణ్, డాక్టర్ సందీప్, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర, నర్సయ్య, సాయి, సరళ రాణి, రోజా పాల్గొన్నారు.

### దూదిగాం గ్రామంలో

**మెండోరా:** దూదిగాం గ్రామంలో మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందుల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. గంగాధరయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు.



## బంగారం కోసం దారుణం.. వృద్ధురాలి హత్య

**అక్షరటుడే, లింగంపేట:** ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన లింగంపేట మండలం పోల్కంపేటలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. లింగంపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోల్కంపేట గ్రామానికి చెందిన నరేంద్రుల సులోచన (75)కు ఇద్దరు కుమారులున్నారు. వంతులో భాగంగా వారంరోజుల క్రితం ఆమె పెద్ద కుమారుడు రాజుల వద్దకు వెళ్లింది. అయితే రాజుల కుటుంబం మూడు రోజుల క్రితం తీర్థయాత్రకు వెళ్లింది. ఇంట్లో ఆమె ఒకతే ఉందని పసిగట్టిన దుండగుడు శుక్రవారం రాత్రి ఆమెను తీవ్రంగా కొట్టి హత్య చేసి ఆమెపై ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లాడు. అందులో ఒక పుస్తెలతాడు, కమ్మలు, వంక ఉంగరం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో వృద్ధురాలు హత్యకు గురికావడం కలకలం రేపింది. సమాచారం అందుకున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సీఐ రాజు రెడ్డి, ఎస్సై దీపక్ కుమార్‌లు ఆయనకు వివరాలు తెలియజేశారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో దుండగుల కోసం గాలించారు. వృద్ధురాలు హత్యకు గురికావడంతో డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం ఆధారంగా హత్యకు గురైన వృద్ధురాలి ఇంటి సమీపంలో ఉండే ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. బంగారం ధర పెరగడంతోనే ఆశతో వృద్ధురాలిని దారుణంగా హత్య చేసి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు.



# ఆర్మూర్‌లో ట్రాఫిక్ అస్తవ్యస్తం

▸ సిగ్నల్స్ ఉన్నా.. నిర్వహణ సున్నా.. ▸ వేధిస్తున్న ట్రాఫిక్ పోలీసుల కొరత ▸ రోడ్లపైనే వాహనాల పార్కింగ్

**రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆర్మూర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికలు లేకపోవడంతో చిన్నచిన్నప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. 14 మండలాల నుంచి నిత్యం ఆర్మూర్ పట్టణానికి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.**
**– అక్షరటుడే, ఆర్మూర్**

ఆర్మూర్ ట్రాఫిక్ నియంత్రణను గతంలో సివిల్ పోలీసులే నిర్వహించేవారు. కొన్నాళ్ల తర్వాత ఆర్మూర్ పాత పోలీస్ స్టేషన్ భవనంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేసి ఒక సీఐతో పాటు ఎస్సై, సిబ్బందిని కేటాయించారు. అయితే బదిలీల్లో భాగంగా సిబ్బంది ఒక్కొక్కరుగా స్టేషన్ ఖాళీ చేసేశారు. దీంతో ప్రస్తుతం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. సివిల్ పోలీస్ స్టేషన్‌లోని కొందరు కానిస్టేబుళ్లు ట్యాబ్‌లు చేతపట్టుకొని ఆర్మూర్ పట్టణంలో తిరుగుతూ వాహనాలకు జరిమానాలు విధిస్తున్నారు. కానీ ఎక్కడా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించిన దాఖలాలు లేవు.

### రోజురోజుకూ జటిలంగా ట్రాఫిక్..

ఆర్మూర్‌లో రోజురోజుకూ ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతుంది. 36 వార్డులు, వందకు పైగా కాలనీలు, లక్ష పైచిలుకు జనాభా ఉంది. మరోవైపు ఆర్మూర్ డివిజన్ కావడంతో ప్రతినిత్యం వ్యాపార, వాణిజ్య, స్కూళ్లు, కాలేజీలకు చుట్టుపక్కల ఉన్న 14 మండలాల గ్రామాల నుంచి వివిధ పనులపై ప్రతినిత్యం జనం ఆర్మూర్‌కు వస్తూపోతూ ఉంటారు. ముఖ్యంగా పాత బస్టాండ్ మొదలుకొని అంబేద్కర్ చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్, మామిడిపల్లి చౌరస్తా, పెర్కిట్ చౌరస్తా ప్రాంతాలు ప్రతినిత్యం జనంతో రద్దీగా ఉంటుంది. పెరుగుతున్న ట్రాఫిక్‌ను అనుగుణంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణంగా ప్రతినిత్యం వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

### చర్యలు చేపట్టేనా..

పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా అంబేద్కర్ చౌరస్తా, జీవన్ రెడ్డి మాల్ ఎదుట భాగంలో, మామిడిపల్లి చౌరస్తాలో సిగ్నళ్లను ఏర్పాటు చేశారు. ఇవి ఒకరోజు పనిచేస్తే మరో రోజు పనిచేయవన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో సిగ్నళ్లు పడ్డా వాహనదారులు యథేచ్ఛగా తిరుగుతూ ప్రతినిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్మూర్ పట్టణంలో అరకొర సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణ కష్టసాధ్యంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు శ్రద్ధ వహించి ఆర్మూర్ ట్రాఫిక్‌కు అనుగుణంగా ట్రాఫిక్ సిబ్బందిని కేటాయించి పట్టణ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందని వాహనదారులు కోరుతున్నారు.

## వారం రోజుల్లో 129 డ్రంకన్ డ్రైవ్ కేసులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వారం రోజుల్లో 129 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి సీపీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈనెల 19వ తేదీ నుంచి 26 వరకు విస్తృతంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపిన 129 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం కోర్టులో ప్రవేశపెట్టారు. వీరిలో 10మందికి వారంరోజుల పాటు జైలుశిక్ష విధించారు. అలాగే 129 మందికి రూ.8.80లక్షలు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి సీపీ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## యువకుడి దారుణ హత్య

**అక్షరటుడే, భిక్కనూరు:** భిక్కనూరు మండలంలోని మోటాట్‌పల్లి గ్రామం లో శనివారం తెల్లవారుజామున దారుణ హత్య జరిగింది. గ్రామానికి చెందిన ఎర్ర రాజు (32) అనే యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు గ్రామపంచాయతీ కార్యాలయ వెనుకాల గొడ్డలితో నరికి చంపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి తండ్రి నర్సయ్య, సోదరుడు శివకుమారులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** బిచ్కుంద మండల కేంద్రంలోని మున్నూరుకాపు సంఘంలో శనివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత..క్రీస్తు బోధనలు మానవాళికి ఎంతో మార్గదర్శకమన్నారు. అన్ని మతాల సారాంశం మానవత్వమేనని వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# కామారెడ్డిలో దారుణం.. ఒకరిపై గొడ్డలితో దాడి..

**అక్షరటుడే, గాంధారి :** గాంధారి మండలం ముదెల్లి గ్రామంలో ఓ వ్యక్తిపై శుక్రవారం అర్ధరాత్రి గొడ్డలితో దాడి జరిగింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లాలో కలకలం రేపింది. స్థానిక ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రంజిత్ అదే గ్రామానికి చెందిన వరుసకు మామ అయిన వ్యక్తి ఇంటికి వెళ్లాడు. అక్కడ వారు మద్యం తాగారు. ఈ క్రమంలో మాట పట్టింపు విషయంలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో నర్సింలు రంజిత్‌పై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో తీవ్రగాయాల పాలైన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం బాన్సువాడకు, అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించారు.


### దావత్‌కు పిలిచి దాడికి పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్..

దాడి ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై ఆంజనేయులు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన నర్సింలు బైక్ కొనడంతో రంజిత్‌ను దావత్‌కు పిలిచాడు. దావత్ చేసుకుంటున్న క్రమంలో మాటామాట పెరిగి రంజిత్‌పై నర్సింలు దాడి చేశాడు.

### రాజకీయాలతో సంబంధం లేదు

దాడి ఘటనకు రాజకీయాలతో సంబంధంలేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఘటన కేవలం సంబంధిత కుటుంబానికి సంబంధించిన అంతర్గత విషయమని పేర్కొన్నారు. ఈ ఘటనకు కాంగ్రెస్ పార్టీకి ఇతర పార్టీలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.





## దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి


**అక్షరటుడే, గాంధారి:** బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడారు. ముదెల్లిలో గొడ్డలి దాడికి గురై జిల్లా కేంద్రంలోని మనోరమ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ కార్యకర్త రంజిత్‌ను మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుచరుల అరాచకాలు రోజురోజుకు శృతిమించుతున్నాయన్నారు. ముదెల్లికి చెందిన రంజిత్‌ను ఎమ్మెల్యే అనుచరులు దావత్ పేరిట ఫోన్ చేసి పిలిపించి గొడ్డలితో దాడి చేశారని ఆరోపించారు. ఘటన గురించి తెలుసుకున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మనోరమ హాస్పిటల్ వైద్యుడితో మాట్లాడారు. బాధితుడి యోగక్షేమాలపై ఆరా తీశారు. 48 గంటలు గడిస్తే కానీ ఏ విషయం చెప్పలేమని ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉన్నాడని వైద్యుడు తెలిపాడు.



## పారిశుధ్య పనులపై స్పెషల్‌డ్రైవ్

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం రాంచంద్రపల్లి గ్రామంలో పారిశుధ్య పనులపై ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు సర్పంచ్ భూషణ్, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూషణ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా, డ్రెయినేజీలు శుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రతి వీధిలో పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా జరుగుతున్నాయని.. గ్రామస్థులు కూడా చెత్తను నిర్దిష్ట ప్రదేశాల్లోనే వేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బందితో సమన్వయం చేసుకొని డ్రెయినేజీ శుభ్రత, చెత్త తొలగింపు, దోమల నివారణ చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ నాగేంద్ర, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**అక్షటుడే, పెద్దకొడప్‌గల్:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. పాఠశాలలో ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు గుండెకు సంబంధించిన ఉచిత హెల్త్ క్యాంప్ మాదాపూర్ మెడికోవర్ ఆస్పత్రి గుండె వైద్య నిపుణులు మహేష్ కుమార్ ఆధ్వర్యంలో జరుగనుందన్నారు. ఈసీపీ, 2డీ ఈకో, టీఎంటీ వంటి ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో ఆర్కే హాస్పిటల్ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు 108కు సమాచారం అందించారు. దీంతో స్పందించిన వారు అతడికి ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాని అప్పటికే అతడు మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. అయితే మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలియకపోవడంతో ప్రస్తుతం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపర్చినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

## వడ్డేపల్లి శివారులో వాహనం ఢీకొని ఒకరు..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వడ్డేపల్లి శివారులోని శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి-నిజాంసాగర్ రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికుల సమాచారం మేరకు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడి ఎడమ భుజంపై సూర్యుడి బొమ్మ టాటూ వేసి ఉందని.. మధ్యలో అమ్మ అని రాసి ఉందని పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లుగా పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం మృతదేహం బాన్సువాడ ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉందని..సమాచారం కోసం నిజాంసాగర్ పీఎస్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.